క్లుప్తంగా

నేడు మంత్రి రాక

నర్వ: మంత్రి వాకిటి శ్రీహరి సోమవారం మండల కేంద్రంలో పర్యటించనున్నారు. యాంకి, నాగిరెడ్డిపల్లిలో రూ.25 లక్షలతో పంచాయతీ భవనాలను నిర్మించనున్నారన్నారు. అలాగే పాథర్చేడ్‌లో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవనం, నర్వ నుంచి జక్కన్నపల్లి వరకు బీటీ రహదారి ఏర్పాటు చేయనుండడంతో మంత్రి భూమిపూజ చేసి పనులను ప్రారంభించనున్నట్లు మండల కాంగ్రెస్ నాయకుడు చెన్నయ్యసాగర్ తెలిపారు. చేయనున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



మరికల్: ఓ గర్భిణి 108లోనే ప్రసవించింది. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన అంజమ్మకు పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు ఆదివారం 108కు ఫోన్ చేశారు. వారు వచ్చి మరికల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు జిల్లా ఆస్పత్రికి తరలించాలని సూచించడంతో అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో అంజమ్మ మగశిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

మండల ఇన్‌చార్జీల నియామకం

నర్వ: ఎమ్మార్పీఎస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు మండలాల వారిగా ఇన్‌చార్జీలను నియమించినట్లు జిల్లా ఇన్‌చార్జీ మంద నర్సింహా అన్నారు. ఆదివారం నర్వలో ఆయన మాట్లాడుతూ.. ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆదేశాల మేరకు మండలంలో ఇన్‌చార్జీలకు నియామకపత్రాలు అందజేశారు. ఈ మేరకు నర్వ మండల ఇంచార్జిగా దండు రామాంజనేయులు, కో ఇంచార్జిలుగా ఎం నర్సింములు, దండు అజయ్, దండు నరేష్, శ్రీనువాసులును నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుడిసె వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

మద్దూరు: రైతులకు యూరియా అందుబాటులో ఉందని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైన రైతులు ఆధార్‌కార్డు, పాసుబుక్ జిరాక్స్ తీసుకొచ్చి పీఏసీఎస్ కార్యాలయంలో సంప్రదిస్తే యూరియా అందజేస్తామన్నారు. ప్రస్తుతం 500 బస్తాలు అందుబాటులో ఉందని దీనిని సోమవారం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

రోహింగ్యాల ఓట్లు తొలగించడంపై హర్షం

నారాయణపేట రూరల్: బంగ్లాదేశ్ నుంచి మన దేశంలోకి అక్రమ చొరబడిన రోహింగ్యాల ఓట్లు తొలగించడం హర్షనీయమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బెంగాల్, అస్సాం లాంటి ప్రాంతాల్లో ప్రభుత్వ ఏర్పాటులో నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తూ దేశ విచ్ఛిన్నానికి పాల్పడుతున్న దేశద్రోహులను కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ వెనుకేసుకు రావడం సిగ్గు చేటన్నారు. దేశ భద్రత దృశ్య ఓట్లు తొలగించడాన్ని ప్రతి భారతీయుడు స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ మృతికి సంతాపం

ఊట్కూరు: పట్టణానికి చెందిన ఎం నర్సింహులు (74) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన 40 ఏళ్లుగా రేషన్ డీలర్‌గా ప్రజలకు సేవలు అందిస్తున్నాడు. నర్సింహులు మృతి చెందిన విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు నాగూరావు నామాజి, జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, నాయకులు బండ్ల లక్ష్మీకాంత్ రెడ్డి, కొండయ్య కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల డేటా ఆన్‌లైన్‌లో నమోదు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సంబంధించిన డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ఎంఈఓ బాలాజీ అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో అన్ని పాఠశాలల ఉపాధ్యాయులతో ఎంఈఓ ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీకి సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. అదే విధంగా యూ డైస్‌లో జీపీ, ఈపీ, ఎఫ్‌పీ అంశాల గురించి వివరించారు.

రోడ్డు విస్తరణ.. పూర్తయ్యేనా..?

- ఏడాదిన్నరగా కొనసాగుతున్న పనులు
- నేటికీ సగం కూడా పూర్తికాని వైనం
- రాకపోకలకు అవస్థలు పడుతున్న ప్రజలు



పాతబస్టాండ్ దగ్గర రెండు నెలల క్రితం తీసిన గుంత

మద్దూరు: పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు నత్తతో పోటీపడుతున్నాయి. సత్యనారాయణ థియేటర్ నుంచి కొత్తబస్టాండ్ దగ్గర ఉన్న వైన్‌షాప్ వరకు కిలోమీటర్ రోడ్డు విస్తరణ చేపట్టారు. అనురాగ్ కంపెనీ 2023 సెప్టెంబర్ 23న పనులను ప్రారంభించింది. ఆగమేఘాల మీద పనులైతే ప్రారంభించారు కానీ పూర్తి చేయడంలో మాత్రం గుత్తేదారుడు అంత శ్రద్ధ చూపడం లేదు. వారం రోజులు పనులు చేస్తారు. నెలల తరబడి వదిలేస్తుండడంతో గుంతల్లో రాకపోకలు సాగించడానికి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు ఎప్పటికి పూర్తవుతాయోనని మండలవాసులు ఎదురుచూస్తున్నారు.

రూ.5.25 కోట్లతో పనులు

దాదాపు రూ.5.25 కోట్లకు టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండేళ్ల క్రితం పనులను ప్రారంభించారు. విస్తరణలో పలు షాపులను కూల్చివేయాల్సి రావడంతో షాపులు కోల్పోతున్న యజమానులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే పోలీసుల చొరవతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. అయితే తర్వాత షాపుల యజమానులు, గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్డుకు ఇరువైపులా 35 అడుగుల విస్తరణకు అంగీకారం తెలుపుతూ గ్రామసభలో తీర్మానం చేసి ఇచ్చారు. రోడ్డు



పోలీస్‌స్టేషన్ సమీపంలో నిలిచిన పనులు

పనులు త్వరగా పూర్తి కావాలని షాపుల యజమానులే స్వచ్ఛందంగా రోడ్డుకు 35 ఫీట్ల వరకు నిర్మాణాలు తొలగించారు. అయితే అప్పుడే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి.

రూ.20 కోట్లలో నూతన టెండర్లు

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో రోడ్డు విస్తరణను 1.4 కిలోమీటర్లకు పెంచారు. అలాగే పెదిరిపాడ్ రోడ్డులోని వివేకానందస్వామి విగ్రహం నుంచి కిలోమీటర్ మేర రోడ్డు విస్తరణ పనులకు కలిపి రూ.20 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులను శ్రీ సాయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. ఏమైందో ఏమో గానీ పనులు మాత్రం ముందుకుసాగడం లేదు.

> **త్వరలోనే పనులు ప్రారంభం**
>
> మద్దూరులో రోడ్డు విస్తరణ పనులను రెండు రోజుల్లో ప్రారంభిస్తాం. విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్, మిషన్ భగీరథ పైప్‌లైన్ షిఫ్టింగ్ జరుతున్న నేపథ్యంలో పనుల్లో జ్యాపం జరుగుతుంది. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి, రోడ్డు విస్తరణ చేపడతాం. అలాగే పెదిరిపాడ్ రోడ్డు విస్తరణ పనులను కూడా త్వరల్లో ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.
>
> –రాములు, అర్అండ్‌బీ డిప్యూటీ ఈఈ, నారాయణపేట

గులాబీ జెండా ఎగరడం ఖాయం

మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మక్తల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండలం బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల్లో అత్యధిక స్థానాలను గెలిపించాలని కోరారు. కార్యకర్తలు గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. పార్టీల్లో విబేధాలను పక్కన పెట్టి కలిసి కట్టుగా ఉండి పని చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దగ్గరకు తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీల పని పూర్తి అయిందని, ఇక కాంగ్రెస్‌పై ప్రజల్లో ఏమాత్రం నమ్మకం లేదన్నారు. మక్తల్ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైతే 15 వందలు మాత్రమే ప్రొసీడింగ్స్ అందజేశారని ఎద్దేవాచేశారు. ఉచిత బస్సు పేరుతో మహిళలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. బతికి ఉన్నత కాలం మక్తల్ నియోకవర్గ ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమన్నారు. నియోజకవర్గ ప్రజలకు చిట్టెం కుటుంబం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు రాజుల ఆశిరెడ్డి, చిట్టెం సుచరిత, మాజీ కౌన్సిలర్లు అన్వర్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూర్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిప్డంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫయాజ్ అహ్మద్ అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లోని ఎస్సీ బాలికల హాస్టల్లో మెడికల్ క్యాంప్ నిర్వహించి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వర్షాలతో మురుగు నిలిచి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. మలేరియా, డెంగీ, చికన్‌గున్యా, పైలేరియా, మెదడువాపు వంటి విషజ్వరాలు వస్తాయన్నారు. దోమలు ఇంట్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు దోమతెరలను వాడాలని, ఇంటి ఆవరణలో పాత టైర్లు, గుంతలతో నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కాచి వడపోసిన నీటిని తాగాలని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సరిత, ఆరోగ్య పర్యవేక్షకుడు సురేందర్‌గౌడ్, వార్డెన్ సుజాత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

2న యోగాసన పోటీల నిర్వహణ

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక లయన్స్ క్లబ్ యోగా సెంటర్‌లో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 2న యోగాసన పోటీలు నిర్వహిస్తున్నట్లు పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు కె.సురేష్, యోగాసన స్పోర్ట్స్ అసోషియేషన్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు తెలియజేశారు. ఈ పోటీలు సబ్ జూనియర్ (10–14), జూనియర్(14–18), సీనియర్(18–28),సీనియర్ ఏ(28–35), సీనియర్ బి (35–45), సీనియర్ సీ(45–55) విభాగాల్లో పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా నిర్వహిస్తామన్నారు. యోగాలలో ట్రెడిషనల్ యోగా, అర్టిస్టిక్ యోగా (సింగిల్, పెయిర్),రిథమిక్ యోగా(పెయిర్) లాంటి వాటిలో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు/బోనాఫైడ్‌లతో పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 94911 67371, 99633 45401 నంబర్లను సంప్రదించాలన్నారు.

పర్యావరణంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఊట్కూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజర్ ఇంతియాజ్ అహమ్మద్ అన్నారు. పర్యావరణాన్ని రక్షించాలంటూ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ గత నెల జూన్ 25 నుంచి ఈనెల 25 వరకు సీఐఓ ఆధ్వర్యంలో పిల్లల చేత 10 లక్షల మొక్కలను నాటినట్లు తెలిపారు. మొక్కలు నాటి పరిరక్షించడం వల్ల పర్యావరణాన్ని కాపాడినవారమవుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇస్కేకార్, షానావాజ్, ముస్తాక్అహ్మద్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో తంటాలు



అధ్వానంగా కోటకొండ-గుండుమాల్ రోడ్డు

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ క్రాసింగ్ నుంచి గుండుమాల్ వరకు రోడ్డు గుంతలమయంగా మారడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును డబల్ రోడ్డుగా మారుస్తుండడంతో పనులు చేపట్టారు. అయితే రహదారి మొత్తం తవ్వి మొరం వేశారు. దీంతో వర్షానికి గుంతల్లో నీళ్లు నిలిచాయి. అభంగాపూర్ నుంచి బండగొండ మధ్య రహదారిపై వెళ్లడానికి నరకయాతన పడాల్సి వస్తుందని ద్విచక్రవాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వెంటనే పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలి



నర్వ: మాజీ రాష్ట్రపతి డా.ఏపీజే అబ్దుల్ కలాంను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు నాయకులు సూచించారు. ఆదివారం కలాం వర్ధంతిని పురస్కరించుకొని నర్వ ఉన్నత పాఠశాలలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కలాం రాష్ట్రపతిగా, సైంటిస్ట్‌గా దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ సంతోషమ్మ, రఫీ, డా.కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించండి సారూ



ప్రహరీ లేని తళంకేరి పాఠశాల

మాగనూర్: విద్యావ్యవస్థ పటిష్టతకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా.. విద్యార్థుల సమస్యలు మాత్రం తీరడం లేదు. పలు పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని తళంకేరి గ్రామంలో గ్రామశివారులో పాఠశాల ఉండటంతో మందుబాబులకు అడ్డాగా మారుతుంది. ఈ మధ్య పాఠశాలకు గ్రిల్స్ వేయించినా అధికారులు ప్రహరీ ఏర్పాటు చేయకుండానే చేతులు దులుపుకున్నారు. దీంతో మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాల ప్రాంగణంలో పందుల బెడద అధికంగా విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



మరికల్: మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు. రాకొండ శివారులో ఉన్న కొయిల్‌సాగర్ వాగు నుంచి ఇసుకను రెండు టిప్పర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా తనిఖీలో పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అలాగే టిప్పర్ల యజమానులు సవారి అశోక్, రాకొండకు చెందిన పవన్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరో చోటికి మార్చాలి



మలుపు దగ్గర ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలో బీటి రహదారి ప్రక్కన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ ప్రమాదకరంగా మారిందని వాహనదారులు, గ్రామస్తులు వాపోతున్నారు. రహదారికి పక్కన ఉండటంతో పాటు మూల మలుపులో ఉండటంతో రాత్రి సమయాల్లో అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన ఫలితం లేకుండా పోయిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరగక ముందే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటికి మార్చాలని కోరుతున్నారు.

చెట్టు పై చెట్టు.. చిత్రమే కనికట్టు



ఈ ఫొటోలో కనిపిస్తున్న చెట్టు పై మరొక చెట్టు మొలిచినట్లు కనిపిస్తుంది కదూ.. అందులో ఒకటి పూర్తిగా ఎండిపోగా, దాని మధ్యలో నుంచి వచ్చిన మొక్క మాత్రం పచ్చగా ఉంది. అదెలా అనుకుంటున్నారా.. వాస్తవానికి ఆ రెండు చెట్లు వేర్వేరుగా మొలిచాయి. దూరం నుంచి చూస్తే ఒకే చెట్టులో రెండు ఉన్నట్లుగా కనిపిస్తున్నాయి. దగ్గరికి వెళ్ల పరిశీలిస్తే రెండు వేర్వేరుగా ఉంటాయి. ఇలా అందరిని ఆశ్చర్య పరుస్తున్న చెట్టు మద్దూరు మండలం చెన్వార్ గ్రామంలో మాజీ సర్పంచ్ గావినోళ్ల కిష్టారెడ్డి పొలంలో కనిపించింది.

– నారాయణపేట రూరల్

జాంధ్ర సంఘం నగర కమిటీ ఎన్నిక

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జాంధ్ర సంఘం నగర కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలరాజు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కోశాధికారిగా అనిల్‌కుమార్‌తోపాటు యువజన సంఘం అధ్యక్షుడిగా సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా విశ్వకాంత్, కోశాధికారిగా నవీన్, మహిళా సంఘం అధ్యక్షురాలిగా ప్రసన్నలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా అనిత, కోశాధికారిగా వరలక్ష్మి ఎన్నికయ్యారు. రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండడంతో ఎన్నికల్లో జాంధ్రులు పోటీ చేసి గెలిపించుకునేందుకు కృషి చేద్దామని నాయకులు పిలుపునిచ్చారు.

ఆర్టీసీ కార్మికులను ఆదుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి అండగా నిలిచి ఆదుకోవాలని ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తమ సొసైటీ తరపున ఆదివారం సీఎం కార్యాలయానికి మెయిల్ ద్వారా విజ్ఞాపనపత్రం పంపించినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల 2017 పీఆర్‌సీ బకాయిలు, 2021 పీఆర్‌సీ అమలు, 8 గంటల పనివిధానం, కా రుణ్య నియామకాల కింద పనిచేస్తున్న ఔట్‌సోరింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయా లని విజ్ఞప్తి చేశారు. సీఎం ప్రకటన కోసం వేలాది మంది ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని తెలిపారు.

నేడు కలెక్టరేట్ వరకు కాలినడక

మహబూబ్‌నగర్ న్యూటౌన్: దివిటిపల్లి డబుల్ బెడ్రూం కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వరకు కాలినడకన చేరుకొని ధర్నా నిర్వహించనున్నట్లు పట్టణ కార్యదర్శి చంద్రకాంత్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ఎత్తు ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు రావడంలేదని, వర్షాల కారణంగా రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని ఆరోపించారు.

తిరుమలలో కూచిపూడి నృత్య ప్రదర్శన



చిన్నచింతకుంట: మండలంలోని గూడూరు కు చెందిన కళాకారిణి షణ్ముక ప్రియ ఆదివా రం తిరుమల దేవస్థానం ఆడిటోరియంలో నిర్వహించి న కూచిపూడి కళా ప్రదర్శనలో పా ల్గొంది. అభినయ ఆర్ట్స్ హనుమాన్ అవార్డ్స్ 25వ వార్షికోత్సవం సందర్భంగా టీటీడీ సౌజన్యంతో మహ తి ఆడిటోరియం వారు నిర్వహించిన ప్రదర్శనకు షణ్ముకప్రియతో పాటు ఎంతోమంది కళా కారులు హాజరుకాగా.. షణ్ముక ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. తిరుపతిలో కూచిపూడి ప్రదర్శన ఇవ్వడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు పలువురు అభినందించారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- మురికి కూపాలుగా జనావాస ప్రాంతాలు
- దోమల విజృంభణతో ఇబ్బందులు
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు



మాగనూర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు (ఫైల్)

మాగనూర్: మండల వ్యాప్తంగా పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎక్కడిచెత్త అక్కడ పేరుకుపోవడంతో దోమల బెడద అధికంగా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం 6 గంటలు దాటితే దోమలతో ఇబ్బందులు తప్పడం లేదని మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని వాపోతున్నారు.

తూతూమంత్రంగా పూడికతీత

మండలంలోని ఏ గ్రామపంచాయతీకి వెళ్లిన పారిశుద్ధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మల్టీపర్పస్ వర్కర్లు ఉన్నప్పటికీ ప్రతి గ్రామంలో వీధుల చివరన చెత్తాచెదారం పేరుకుపోతుంది. మురుగు కాల్వల్లో సైతం తూతూమంత్రంగా పూడిక తీస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మురుగు కాల్వలే లేకపోవడంతో ఇళ్లలో వాడిన నీరు సీసీ రోడ్లపైనే పారుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో దోమలు ప్రజలను నిద్రపోనివ్వడం లేదు.

నివారణ చర్యలు శూన్యం..

వర్షాకాలం సీజన్ మొదలైన పారిశుద్ధ్యం మెరుగుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాల్సి ఉన్నా ఏ గ్రామంలో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించడం లేదు. మురుగు నీరు నిలిచిన చోట ఆయిల్ బాల్స్ వేయించాలి. కానీ అ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> 
>
> గ్రామాలలో దోమల బెడద ఉన్న మాట వాస్తవమే. ముఖ్యంగా వర్షాకాలం కావడంతో కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దోమల విజృంభణ అధికంగా ఉంది. సంబంధిత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించి పారిశుద్ధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటాం. దోమల నివారణకు కృషి చేస్తాం.
>
> –శ్రీనివాసులు, మాగనూర్ ఎంపీడీఓ

> **దోమల బెడద అధికంగా ఉంది**
>
> 
>
> పట్టణంలో దోమల బెడద తీవ్రంగా ఉంది. చీకటి పడితే చాలు దోమలతో సతమతమవుతున్నాం. ఇంట్లో ఉన్నా, వీధిలో ఉన్నా దోమలు కుడుతున్నాయి. కాల్వల్లో పూడిక కూడా చాలా రోజులుగా తీయకపోవడంతో ముగరు ముందుకు కదలక నివాస ప్రాంతాల్లో నిలుస్తుంది. దుర్గంధం వస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి మురుగు కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి.
>
> –రవి, ఉజ్జెల్లి బీఆర్ఎస్ నాయకులు